



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎన్‌పీ వెంకటేశ్

రాష్ట్రస్థాయి టోర్నీలో
విజేతగా నిలవాలి

- జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్
- ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

5

లొద్ది మల్లయ్య దర్శనానికి
అనుమతి ఇవ్వాలి

- బజరంగ్ దళ్ వినతి

5

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

- హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి చేరిన మృతదేహం
- వెనక్కి పంపించిన పోలీసులు

5

డ్రంకెన్ డ్రైవ్ కేసులో
ఐదుగురికి జైలు శిక్ష

- నాగర్‌కర్నూల్ ఎస్‌ఐ గోవర్ధన్

5

ఆదర్శ గురువులు



నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం మార్చాల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు అవ్వారి శ్రీనివాసులు తన కుమారుడు కార్తికేయను గ్రామంలోని జడ్పీహెచ్ఎస్‌లో ఏడో తరగతిలో చేర్పిస్తున్న దృశ్యం

తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పిస్తున్న గవర్నమెంట్ ఉపాధ్యాయులు

- మిగతా వారికి ఆదర్శంగా నిలుస్తున్న పలువురు టీచర్లు
- మెజారిటీ ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రైవేటుకే పంపుతున్న పరిస్థితి
- వారు బడిబాటలో పాల్గొన్నప్పుడు తల్లిదండ్రుల నుంచి ఎదురు ప్రశ్నలు
- ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెరగాలంటే అందరూ పాటించాల్సిందే..

ప్రతీఏటా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని ప్రభుత్వం బడిబాట కార్యక్రమం నిర్వహిస్తుంది.. ఆ పాఠశాల పరిధిలో ఉండే ఊరిలో తిరిగి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం ఉపాధ్యాయుల బాధ్యత. పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలు, అందుతున్న విద్యను ఈ బడిబాట కార్యక్రమంలో వివరిస్తున్నారు. బడిబాటకు వెళుతున్న ఉపాధ్యాయులు కొందరికి తల్లిదండ్రుల నుంచి ఎదురుప్రశ్నలు వస్తున్నాయి. తమ పిల్లలను ప్రభుత్వంలో చేర్పిస్తాం సరే కానీ మీ పిల్లలు ఎక్కడ చదువుతున్నారని అడుగుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి విద్య ఉంటే మీపై మీకే నమ్మకం లేదా అని ప్రశ్నిస్తున్నారు. మీ పిల్లలను ప్రైవేటుకు పంపి మా పిల్లలను ప్రభుత్వంలో ఎలా చేర్పించమంటారు అని అడుగుతున్నారు.. ఈ వింత పరిస్థితిలో కొంతమంది ఉపాధ్యాయులు మొక్కుబడిగా బడిబాటలో పాల్గొంటున్న పరిస్థితి..

నారాయణపేట జిల్లా కృష్ణా మండలం కున్సి గ్రామంలో పనిచేస్తున్న నల్లె శివరాజ్ అదే గ్రామంలో విద్యనభ్యసించి ఉపాధ్యాయుడు అయ్యారు. ఇప్పుడు అదే గ్రామంలో ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ప్రతీఏటా బడిబాట నిర్వహిస్తున్న తాను తన పిల్లలను కూడా ఇందులోనే చేర్పిస్తే గ్రామ ప్రజలకు ఆదర్శంగా నిలుస్తానని భావించాడు. ప్రైవేటుకు పిల్లలను పంపించకుండా ఉంటే తన ఉద్యోగం చేసిన తృప్తి కూడా ఉంటుందనే ఉద్దేశంతో 5వ తరగతి చదువుతున్న తన కుమారుడు నల్లె తరుణ్, రెండో తరగతి చదువుతున్న తన కూతురు నల్లె భవ్యశ్రీలకు తాను పనిచేస్తున్న పాఠశాలలోనే అడ్మిషన్ ఇచ్చుకున్నారు..

మహబూబ్‌నగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రైవేటు పాఠశాలల్లో తమ పిల్లలను చదివిస్తున్న కొందరు ఉపాధ్యాయులపై తల్లిదండ్రులు ప్రశ్నల వర్షం కురిపిస్తుంటే మరికొందరు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించి ఆదర్శంగా నిలుస్తుండటాన్ని హర్షిస్తున్నారు. ఒక్క నల్లె శివరాజ్ మాత్రమే కాదు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇటీవలి కాలంలో ఈ తరహా ఆలోచనల్లోకి ఉపాధ్యాయులు వచ్చేస్తున్నారు. తమ మీద తమకే నమ్మకం లేకపోతే తల్లిదండ్రుల్లో ప్రభుత్వ పాఠశాలలు, ఉపాధ్యాయులపై ఉన్న నమ్మకం సన్నగిల్లుతుందనే ఉద్దేశంతో వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలవైపు మళ్లిస్తున్నారు. వారిని చూసి మరింత మంది ఈ తరహా ప్రయత్నం చేస్తే ప్రభుత్వంలో మెరుగైన బోధన లభించే అవకాశం ఉంటుంది. అలాగే ప్రైవేటుతో పోటీపడే అవకాశం కూడా ఉంటుంది. ఇప్పటికే ప్రైవేటులో ఫీజులు చెల్లించాలంటే తల్లిదండ్రులు హడలిపోతున్న క్రమంలో ప్రభుత్వంవైపు మళ్లే అవకాశాలు కూడా మెండుగా ఉంటాయని చెప్పవచ్చు. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది కొంత ప్రభుత్వ పాఠశాలలవైపు మొగ్గుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇది మరింతగా పెరగాలంటే ప్రభుత్వ ఉపాధ్యాయులే తమపై నమ్మకం పెంచుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చదివిస్తున్న ఉపాధ్యాయులపై ప్రత్యేక కథనం...

- నాగర్‌కర్నూలు జిల్లా కల్వకుర్తి మండలం మార్చాల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న అవ్వారి శ్రీనివాసులు తన కుమారుడు కార్తికేయను మార్చాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతిలో చేర్పించాడు. నేటి పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన

(మిగతా 4లో..)



అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

అధికార యంత్రాంగం
సిద్ధంగా ఉండాలి

- వరదలు వస్తే ఎదుర్కొనేందుకు ఏర్పాట్లు చేసుకోవాలి
- ప్రాణ నష్టం సంభవించకుండా జాగ్రత్త వహించాలి
- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : అకస్మాత్తుగా వరదలు సంభవిస్తే ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో విపత్తు నిర్వహణపై లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందన్నారు. కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు, జిల్లాలోని అమరచింత, ఆత్మకూరు, చిన్నంబావి, కొత్తకోట, పెబ్బేరు తదితర ప్రాంతాల్లో అధిక వర్షాలతో కృష్ణానది ఉధృతంగా ప్రవహించే ప్రమాదం ఉందని తెలిపారు. అందుకు అనుగుణంగా ఆయా మండలాల్లో లైన్ డిపార్ట్‌మెంట్ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ప్రజలు, జంతువులకు ప్రాణనష్టం జరగకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. వరదలు వస్తే రోడ్లు, వంతెనలు, కాజ్‌వేలపై నుంచి మనుషులు, వాహనాలు దాటే ప్రయత్నంలో కొట్టుకుపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచుకోవాలని, కలెక్టరేట్‌తో పాటు మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. 24/7 సిబ్బందిని నియమించడం వంటి ముందస్తు ప్రణాళికలను రూపొందించుకోవాలని సూచించారు. వరదలు తగ్గిన తర్వాత ప్రబలే వ్యాధులపై కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, ముఖ్య ప్రణాళికాధికారి భూపాల్‌రెడ్డి, మత్స్యశాఖ అధికారి లక్ష్మప్ప, విద్యుత్ శాఖ డీఈ శ్రీనివాస్, కొత్తకోట సీఐ శివకుమార్, అగ్నిమాపక శాఖ అధికారులు, తహసీల్దార్లు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

మగ్గం ఉన్నవారికే
కొత్త జియోట్యాగ్‌లు

- జిల్లా చేనేత, జౌళీశాఖ ఏడీ గోవిందయ్య
- దరఖాస్తుదారుల మగ్గాలు పరిశీలన

4



సమావేశంలో మాట్లాడుతున్న గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్

నీతి ఆయోగ్ ర్యాంకింగ్‌లో...
గట్టు బ్లాక్‌కు 5వ స్థానం

- భవిష్యత్తులో 100 శాతం లక్ష్య సాధనకు కృషి చేయాలి
- జోగులాంబ గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : నీతి ఆయోగ్ ర్యాంకింగ్‌లో జాతీయ స్థాయిలో గట్టు బ్లాక్‌కు 5వ స్థానం దక్కించుకున్నదని జోగుళాంబ గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. భవిష్యత్తులో అగ్రస్థానం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. నీతి ఆయోగ్ విడుదల చేసిన 2024-25 క్యూ4 డెల్టా ర్యాంకింగ్‌లో గట్టు బ్లాక్ దేశంలో 5వ స్థానం, జోన్-3లో 2వ స్థానాన్ని సాధించిందని తెలిపారు. ఈ విజయానికి గుర్తింపుగా గట్టు బ్లాక్‌కు నీతి అయోగ్ నుంచి కోటి రూపాయల పురస్కారం దక్కిందన్నారు. ఈ విజయాన్ని సాధించేందుకు కృషి చేసిన గట్టు మండల అధికారులు, విభాగాధిపతులు, ఫ్రంట్ లైన్ సిబ్బందికి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో 100 శాతం కేపీఐ లక్ష్యసాధన కోసం ఇదే అంకితభావంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అలాగే ఆరోగ్య శాఖకు సహకరిస్తున్న ఎస్‌బీఐ సంజీవని, భవిష్యభారత్, టీచ్ ఫర్ చేంజ్, ఎంవీ ఫౌండేషన్ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ప్రస్తుతం గట్టు బ్లాక్ కంపోజిట్ స్కోర్ 69.43గా ఉందని, దానిని మరింత మెరుగుపరిచి 100 శాతం లక్ష్య సాధనకు అధికారులు కృషి చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డీపీవో నాగేంద్రం, జిల్లా సంక్షేమాధికారి సునంద, ఎంపీడీవో చెన్నయ్య, ప్రోగ్రాం అధికారి సంధ్యారాణి, అస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.



కిష్టగిరిలోని లక్ష్మీ నరసింహ ఇండస్ట్రీస్‌లో తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లు

సీఎంఆర్ అప్పగింత
వేగవంతం చేయాలి

- నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదు
- అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లు
- వనపర్తి, కొత్తకోట మండలాల్లో రైస్ మిల్లుల తనిఖీ

వనపర్తి రూరల్/ కొత్తకోట, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) అప్పగింత ప్రక్రియను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మిల్లర్లను ఆదేశించారు. వనపర్తి జిల్లాలోని వనపర్తి, కొత్తకోట మండలాల్లోని రైస్‌మిల్లులను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. వనపర్తి మండలంలోని కిష్టగిరిలో లక్ష్మీ నరసింహ ఇండస్ట్రీస్‌ను జిల్లా మేనేజర్, సివిల్ సప్లై సీఎస్ జగన్మోహన్, అసిస్టెంట్ మేనేజర్ బాలు నాయక్‌తో కలిసి తనిఖీ చేశారు. సీఎంఆర్ అప్పగింత ప్రస్తుత స్థితిని పరిశీలించారు. ధాన్యం నిల్వలు, మిల్లింగ్ సామర్థ్యం, బియ్యం అప్పగింతలో ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. నిర్దేశిత సమయం కంటే ముందే సీఎంఆర్ అప్పగింత పూర్తి చేయాలని సూచించారు. అందుకు అవసరమైన అన్ని చర్యలను తీసుకోవాలని అధికారులకు, మిల్లు యజమానులకు సూచించారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని సకాలంలో మిల్లింగ్ చేసి, పౌర సరఫరాల శాఖకు అందించడం ఎంత ముఖ్యమో వివరించారు. అనంతరం కొత్తకోట మండలంలోని ముమ్మళపల్లి, సంకిరెడ్డిపల్లి గ్రామాల శివారులోని ఆగ్రో ఇండ్రస్ట్రీస్, కొట్టం రైస్ మిల్లులను తనిఖీ చేశారు. సీఎంఆర్ అప్పగింతలో మిల్లర్లు నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.



చిట్యాల గ్రామంలోని నర్సరీలో నాటేందుకు సిద్ధంగా ఉన్న మొక్కలు


వన మహోత్సవానికి..
సమయం ఆసన్నం

- వనపర్తి జిల్లాలో 50 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం
- 255 గ్రామ పంచాయతీల్లో నర్సరీల నిర్వహణ
- జిల్లా వ్యాప్తంగా నాటేందుకు పూలు, పండ్లు, ఔషధ మొక్కలు సిద్ధం

ఊరూ.. వాడా.. పచ్చదనంతో పరవశించాలి. అందుకోసం ప్రభుత్వం వనమహోత్సవానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటి పెంచనున్నది. అందుకోసం వనపర్తి జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో నర్సరీలు నిర్వహిస్తోంది. అందులో పూలు, పండ్ల మొక్కలతో పాటు నీడ నిచ్చే చెట్లను పెంచుతోంది. ఈనెల మొదటి వారం లేదా రెండవ వారంలో వనమహోత్సవం నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.

- వనపర్తి రూరల్ (ఆంధ్రజ్యోతి)

హై లెవెల్ రోడ్ బ్రిడ్జి నిర్మాణానికి
ముందడుగు



మాట్లాడుతున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

- 121.92 కోట్ల మంజూరు, జీవో జారీ చేసిన ప్రభుత్వం
- వెల్లడించిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల న్యూటౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, ధరూర్ మండల పరిధిలోని జూరాల ప్రాజెక్టు వద్ద హైలెవెల్ రోడ్డు బ్రిడ్జి నిర్మాణానికి రూ. 121.92 కోట్లు మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిందని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జూరాల ప్రాజెక్టును సందర్శించారని తెలిపారు. ఆ సందర్భంగా జూరాల హైలెవెల్ రోడ్డు బ్రిడ్జి నిర్మాణానికి జీవో వెంటనే ఇప్పిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం జీవో జారీ చేసినందుకు ఆయన హర్షం వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజ నర్సింహకు, జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎంపీ మల్లురవిలకు నియోజకవర్గ రైతులు, ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

బాలలకు బంగారు భవిష్యత్తు

- బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై ప్రత్యేక దృష్టి
- అందుకోసం అధికారులు కృషి చేయాలి
- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

5



అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

మగ్గం ఉన్నవారికే కొత్త జియోట్యాగ్‌లు

» జియోట్యాగ్ దరఖాస్తుదారుల మగ్గాలు పరిశీలన

» జిల్లా చేనేత జౌళిశాఖ ఏడీ గోవిందయ్య



రాజోలిలో చేనేత కార్మికుల మగ్గాలను పరిశీలిస్తున్న ఏడీ గోవిందయ్య, ఆర్‌డీడీ పద్మ

రాజోలి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మగ్గం ఉన్నవారికే కొత్త జియోట్యాగ్ నెంబరు అందుతుందని జోగుళాంబ గద్వాల జిల్లా చేనేత, జౌళీశాఖ ఏడీ గోవిందయ్య అన్నారు. రాజోలిలో కొత్తగా చేనేత మగ్గం ఏర్పాటు చేసుకుని చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తూ, కొత్త జియోట్యాగ్ నెంబరు కోసం దరఖాస్తు చేసుకున్న కార్మికుల మగ్గాలను మంగళవారం ఆయన ప్రాంతీయ ఉప సంచాలకు (ఆర్‌డీడీ) పద్మ, ఏడీవో ఉపేంద్రతో కలిసి దరఖాస్తుదారుల ఇంటింటికీ తిరిగి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీ గోవిందయ్య మాట్లాడుతూ రాజోలిలో 141మంది, అయిజలో 40మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వారి మగ్గాల పరిశీలన అనంతరం ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డీడీ పద్మ, ఏడీవో ఉపేంద్ర, క్లస్టర్ సీడీలు శివకుమార్, కార్మికులు పాల్గొన్నారు.

జాడ లేని వాన



వర్షాలు కురిసినప్పుడు పత్తి విత్తనాలు విత్తుతున్న కూలీలు(ఫైల్)

» జూన్ నెల పూర్తయినా కురువని వర్షాలు

» వర్షం కోసం అన్నదాతల ఎదురుచూపులు

మరికల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తొలకరి వర్షాలు జూన్ మొదటి వారంలోనే ప్రారంభమయ్యాయి. తొలకరి జల్లులతో రైతులు ఏరువాక పనులు మొదలు పెట్టి విత్తనాలు విత్తుకున్నారు. జూన్ నెల మొదటివారం లోనే నైరుతీ రుతుపవనాలు, రెండోవారం నుంచి తొలకరి వర్షాలు కురిశాయి. జూలై నెల వచ్చినా ఇప్పటివరకు వాన జాడ కానరావడం లేదు. జోరుగా వర్షా లు కురువాల్సిన సమయంలో వేసవి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మే చివ రి వారంలో కురిసిన వర్షాలకు రైతులు దుక్కులు దున్ని విత్తనాలు నాటారు. భారీ వర్షం కురిసిన తర్వాత విత్తనాలు విత్తాల్సిన రైతులు ముందుగానే విత్తనా లు వేశారు. గతంలో ఈ సమయానికి పత్తిసాగు సగం వరకు పూర్తయి కలుపు తీసే పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ఈ సంవత్సరం వర్షాలు లేకున్నా చాలాచోట్ల ఇప్పటికే పత్తి విత్తనాలు విత్తుకుని వరుణుడిపై భారం వేశారు. కేంద్ర ప్రభుత్వం పత్తి మద్దతు ధర రూ.7,020 పెంచడంతో ఈసారి అధికంగా పత్తిసాగు వైపు అన్నదాతలు మొగ్గు చూపుతున్నారు. మార్కెట్‌లో విత్తనాలకు డిమాండ్ పెరిగింది. కొంత మంది రైతులు విత్తనాలు వేసుకున్నారు. మరికొందరు విత్తనాలు వేయడానికి సిద్ధంగా ఉన్నారు. సకాలంలో వర్షాలు రాకపోతే మరోసారి విత్తనాలు విత్తడం తప్పదు. అకాలవర్షాల నుంచి పంటలను రక్షించేందుకు గతేడాది నుంచి ప్రభుత్వం ముందుస్తు సాగు విధానం ప్రవేశపెట్టినప్పటికి మండలంలో ముందుస్తు సాగుకు వాతావరణం అనుకూలించడం లేదు.

ఎనిమిది ఏళ్ల తర్వాత తెరుచుకున్న బడి

మండల విద్యాధికారి భాస్కర్‌శర్మ



వార్లగుడిసెలో పాఠశాల ప్రారంభించిన మండల విద్యాధికారి భాస్కర్‌శర్మ

కోడేరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వార్ల గుడిసెలలో ఎనిమిదేళ్ల క్రితం మూతపడిన పాఠశాలను తిరిగి మంగళవారం మండల విద్యాశాఖాధికారి భాస్కర్‌శర్మ ప్రారంభించారు. జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశానుసారం పాఠశాలను ప్రారంభించినట్లు తెలిపారు. వార్ల గుడిసెలలో ముగ్గురు పిల్లలతో పాఠశాలను ప్రారంభించామని, పసుపుల పాఠశాలకు యూపీఎస్ పసుపుల నుంచి ఎస్జీటి టీచర్ నరేష్‌ను డిప్యూటేషన్‌పై ఇక్కడ పని చేస్తారని ఎంఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో కోడేరు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు సుధారాణి, పసుపుల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య, సీఆర్పీ విజయలక్ష్మి, జనుంపల్లి హెచ్ఎం సుధాకర్, ఎంఈవో ఆఫీస్ ఆపరేటర్ పి. నాగేంద్రం పాల్గొన్నారు.

కృష్ణానది తీరంలోకి ఎవరూ వెళ్లవద్దు



మంచాలకట్ట సమీపంలో కృష్ణానది తీరంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన పోలీసులు

పెంట్లవెల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానది తీరంలోకి పర్యాటకులు, అదే విధంగా స్థానికులు ఎవరు కూడా వెళ్లవద్దని పెంట్లవెల్లి ఎస్ఐ రామన్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మంచాలకట్ట గ్రామంలో కృష్ణానది తీరాన నదిలోకి ఎవరూ వెళ్లవద్దని ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృష్ణానదిలో వరద ప్రవాహం ఎక్కువగా ఉండటంతో మత్స్యకారులు కూడా చేపల వేటకు వెళ్లవద్దని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా పర్యాటకులు స్నానాలు చేసేందుకు ఈత కొట్టేందుకు వెళ్లవద్దని తెలిపారు. అదే విధంగా నది దగ్గర కూర్చొని మద్యం సేవించడం వంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, పోలీసులు పాల్గొన్నారు.

అధ్వాన ప్రాంగణాలు..

» జిల్లాలో అలంకారప్రాయంగా తెలంగాణ క్రీడా ప్రాంగణాలు

» ఆటలాడేందుకు అనువుగా లేని స్థలాలు

» ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో 280 ఏర్పాటు



గట్టులో మౌలిక వసతులు కల్పించక నిరుపయోగంగా ఉన్న క్రీడాప్రాంగణం

గట్టు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ఊరూరా తెలంగాణ క్రీడాప్రాంగణాలు అలంకారప్రాయంగా మారాయి. ఎలాంటి సౌకర్యాలు లేకుండా, కేవలం బోర్డు ఏర్పాటు చేసి వదిలేశారు. స్థలాలు కూడా ఆటలు ఆడేందుకు అనువుగా లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా 280 వరకు ఏర్పాటు చేసిన ఈ క్రీడా ప్రాంగణాల్లో గత ప్రభుత్వ హయాంలో విటిని అభివృద్ధిపరచడానికి కొంత శ్రద్ధ కనబరిచారు. కానీ ప్రస్తుతం గాలికివదలి వేయడంతో చెత్తాచెదారంతో నిండి, పిచ్చిమొక్కలు పెరిగి ఎందుకూ పనికిరాకుండా పోయాయి.

ప్రభుత్వ స్థలాల గుర్తింపు

జిల్లా వ్యాప్తంగా 12 మండలాల్లోని గ్రామాల్లో మొత్తం 296 ప్రాంగణాలు నిర్మించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. కాగా ఇందులో 280 ప్రాంగణాలకు ప్రభుత్వ స్థలాలను గుర్తించారు. మిగితా 16 ప్రాంగణాలకు ప్రభుత్వ స్థలాలు చూయించలేకపోయారు. ప్రస్తుతం జిల్లాలో 280 ప్రాంగణాలను పూర్తి చేసినట్లు అధికారుల రికార్డులు చెబుతున్నాయి. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. ఒక్కో ప్రాంగణంలో చదును చేయడంతో పాటు క్రీడలు ఆడటానికి కావాల్సిన పరికరాల ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. అనేక ప్రాంగణాలలో నామమాత్రంగా పనులు చేసి వదిలేశారనే ఆరోపణలు ఉన్నాయి.

బోర్డులకే పరిమితం

గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా మైదానాలు బోర్డులకే పరిమితమయ్యాయి. ఊరికి దూరంగా ఆటలకు అనుకూలంగా లేని స్థలాల్లో బోర్డులు ఏర్పాటు చేసి వదిలేశారు. ఈ క్రీడా ప్రాంగణాలవైపు క్రీడలు ఆడటానికి గ్రామాలలోని యువకులు ఇష్టపడటంలేదు. పండుగలు, ప్రత్యేక రోజుల్లో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నప్పటికీ అసౌకర్యంగా ఉండడం వల్ల ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణాలను వినియోగించుకోవడం లేదు. రూ.లక్షలు వ్యయం చేసినప్పటికీ మైదానాలను ఉపయోగంలోకి తేకపోవడంపై గ్రామీణ క్రీడాకారుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను క్రీడల్లో ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మరిన్ని సౌకర్యాలు కల్పించాలి



గ్రామాల్లోని తెలంగాణ క్రీడా ప్రాంగణాల్లో మరిన్ని సౌకర్యాలు కల్పించి, వినియోగంలోకి తేవాలి. దీనికోసం పర్యవేక్షణ కూడా చేయాలి. రూ.లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన ఈ మైదానాలు అందుబాటులోకి వస్తే గ్రామీణ క్రీడాకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.

\- కమ్మరి, రమేశ్, యువకుడు గట్టు

మండలాల వారీగా క్రీడా ప్రాంగణాలు			
మండలం	మంజూరు	పూర్తయినవి	మిగిలినవి
అయిజ	30	30	0
అలంపూర్	14	14	0
ధరూర్	37	34	3
గద్వాల	32	30	2
గట్టు	33	32	1
ఇటిక్యాల	32	31	1
కే.టీ.దొడ్డి	31	28	3
మల్దకల్	31	26	5
మానవపాడు	16	16	0
రాజోలి	13	13	0
ఉండవల్లి	16	16	0
వడ్డేపల్లి	11	10	1
మొత్తం	296	280	16

ఉపయోగంలోకి తెస్తాం



గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న క్రీడామైదానాలను ఉపయోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. క్రీడా మైదానాల నిర్వహణ ఆయా గ్రామ పంచాయతీలకు ఉంటుంది. ఎక్కడెక్కడ నిరుపయోగంగా ఉన్నాయో వాటిపై సమీక్ష నిర్వహిస్తాము. వాటి నిర్వహణతో పాటు అభివృద్ధికి ప్రత్యేకంగా నిదులు లేవు. అయా గ్రామ పంచాయతీలలో పరిశీలించి కార్యదర్శులకు సూచనలు ఇస్తాము.

\- నర్సింగరావు, అదనపు కలెక్టర్

రైతుల సమస్యలు పరిష్కరించాలి

» విద్యుత్ సబ్ స్టేషన్ ముందు రైతులతో కలిసి బీజేపీ నాయకుల ధర్నా



పెద్దకొత్తపల్లిలో విద్యుత్ సబ్ స్టేషన్ ముందు ధర్నా చేస్తున్న బీజేపీ శ్రేణులు

పెద్దకొత్తపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : తమ వ్యవసాయ బోరు బావులకు ట్రాన్స్‌ఫార్మర్ కోసం డీడీలు కట్టి ఏళ్లు గడుస్తున్నా అధికారులు ఇవ్వడం లేదని బీజేపీ నాయకులు ఆరోపించారు. బీజేపీ మండల అధ్యక్షుడు దేశమోని పరశురాముడు ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ ముందు రైతులతో కలిసి గంట సేపు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయాన్ని నమ్ముకుని జీవిస్తున్న రైతులు ట్రాన్స్‌ఫార్మర్స్ కోసం డీడీలు కట్టి ఏళ్లు గడుస్తున్నా విద్యుత్ అధికారులు ఇవ్వకుండా ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. రైతులకు వెంటనే ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

విద్యుత్ ఏఈ ప్రదీప్ స్పందిస్తూ డీడీలు కట్టిన రైతులకు సీనియార్టీ ప్రకారం వెం టనే ట్రాన్స్‌ఫార్మర్లు అందజేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పదిర భీమేష్, తిరుమల్ యాదవ్, పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులు మేకల శి వ, పార్టీ మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, రాజు, పూజారి చంద్రశేఖర్, వినోద్, లింగస్వామి, మేకల శివ, పిల్లి నాగరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ అనుమతులతోనే ఇసుక తరలింపు

» ఆర్డీవో రాంచందర్



మాగనూరులో స్థానిక ప్రజలు, రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో రాంచందర్

మాగనూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతులతో రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి ఇసుక తరలింపు జరుగుతుందని నారాయణపేట ఆర్డీవో రాంచందర్‌నాయక్ అన్నారు. మంగళవారం పేట జిల్లా మాగనూరు మండల కేంద్రంలోని 167వ జాతీయ రహదారి బ్రిడ్జి సమీపంలోని పెద్దవాగు ఇసుక రీచ్‌ను ఆర్డీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొడంగల్ ఎత్తిపోతల పథకానికి పైపులైన్ కోసం పైపులు తయారు చేసే రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి మాగనూరు పెద్దవాగు నుంచి ఇసుకను తీసుకెళ్లేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామస్థులు, రైతులు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఇసుకను తరలిస్తే తాగునీరు, సాగునీటికి కష్టాలు ఏర్పడుతాయని తెలిపారు. స్పందించిన ఆర్డీవో వాగులో మైనింగ్ అధికారుల సూచనలతో ఒక మీటరు లోతులోనే ఇసుక తీసుకెళ్తారన్నారు. ఎవరికైనా అనుమానం వస్తే ఇసుక తరలించే సమయంలో ఒక్క మీటరు కన్నా ఎక్కువ లోతు ఇసుకను తీసుకువెళ్తుంటే ఆపాలని స్థానికులకు సూచించారు. అధికారుల పర్యవేక్షణలోనే ఇసుక తరలింపు ఉంటుందన్నారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ నాగలక్ష్మి, డీటీ సురేష్‌కుమార్, సీఐ రాం లాల్, ఎస్ఐ అశోక్‌బాబు, ఆర్ఐ శ్రీశైలం, మైనింగ్ ఆర్ఐ ప్రతాప్, వివిధ పార్టీల నాయకులు, రైతులు ఉన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

» జిల్లా ఉద్యానవన శాఖ అధికారి వేణుగోపాల్



రైతులకు స్ప్రింకర్ల అందజేస్తున్న అధికారి వేణుగోపాల్

మహమ్మదాబాద్ జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్ పామ్ సాగుతో రైతులకు అధిక లాభాలు ఉన్నాయని, ఇందుకోసం రైతులు ముందుకు రావాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి కె.వేణుగోపాల్ అన్నారు. మంగళవారం నంచర్ల రైతువేదికలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆయిల్ పామ్ సాగుకు సంబంధించి ప్రభుత్వం పూర్తిస్థాయిలో సబ్సిడీ అందజేస్తోందన్నారు. చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం, ఎస్సీ ఎస్టీలకు 100 శాతం సబ్సిడీ ఇస్తోందన్నారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో మొక్కలు అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు స్ప్రింకర్లకు సంబంధించి 75శాతం రాయితీతో అందిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేఎం నారాయణ మాట్లాడుతూ రైతులకు గత ప్రభుత్వం సబ్సిడీ కింద రైతులకు ఇచ్చే బిందు, తుంపర్ల నిలిపివేసిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అయిన తర్వాత రైతులకు వ్యవసాయానికి అన్ని రకాల పరికరాలు సబ్సిడీ కింద ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం 19 మంది రైతులకు స్ప్రింక్లర్లు అందజేశారు. ఉద్యావనశాఖ అధికారి స్వప్న, ఆయిల్ పామ్ క్లస్టర్ ఆఫీసర్ శేఖర్, ఏఈవో మౌనిక పాల్గొన్నారు.

7న ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 1(ఆంధ్రజ్యోతి) : గద్వాల ఉత్తనూరులో ఈనెల 11, 12 తేదీల్లో నిర్వహించ నున్న అంతర్ జిల్లాల జూనియర్ బాస్కెట్‌బాల్ చాంపి యన్ షిప్‌లో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాల, బాలికల జట్ల ఎంపికలను ఈ నెల 7న బాలనగర్ మండల కేంద్రంలోని ఈఎంఆర్ఎస్-ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో నిర్వహిస్తున్న బాస్కెట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్య దర్శులు మక్బూద్ బిన్ జాకేర్, నస్రూల్లా హైదర్ మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. 01-01-2007 తరువాత పుట్టిన వారు ఎంపికలకు అర్హులని పేర్కొన్నారు. క్రీడాకా రులు జనన ధ్రువపత్రం, ఆధార్, తల్లిదండ్రుల ఆధార్ తీ సుకొని ఉదయం 9 గంటలకు రిపోర్టు చేయాలని కోరారు.

ఆదర్శ గురువులు

(5వ పేజీ తరువాయి)

విద్య అందుతోందని అందరికీ తెలిసేందుకు, ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగించే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉపాధ్యాయుడు శ్రీనివాస్ తెలుపుతున్నారు. అదే గ్రామంలో శ్రీనివాస్ కూడా పనిచేస్తుండటంతో రాకపోకలకు సంబంధించి కూడా ఇబ్బందులు లేవు.

మరి కొంతమంది కూడా...

మల్దకల్ మండలం చిప్పదొడ్డిలో పనిచేస్తున్న మల్లేష్ తన కుమారులను ఎల్కూరు జడ్పీహెచ్ఎస్‌లో చదివిస్తున్నారు.. పెద్ద కుమారుడు సాత్విక్ నాలుగో తరగతి చదువుతుండగా చిన్న కుమారుడు దీక్షిత్ మూడో తరగతి చదువుతున్నాడు. అలాగే మదనాపూర్ మండలం దుప్పల్లిలో పనిచేస్తున్న రమేష్ అనే ఉపాధ్యాయుడు తన కూతురు అక్షయను కొత్తకోట బాలికల ఉన్నత పాఠశాలలో మూడేళ్లుగా చదివిస్తున్నారు. ప్రస్తుతం అక్షయ పదో తరగతి చదువుతోంది. భూత్పూరు మండలం కర్వెన జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్ తన కుమారుడు కార్తీక్‌ను అక్కడే ఎనిమిదో తరగతి చదివిస్తున్నాడు. కోస్గి ఎంపీపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న అఖిల కానం తన పెద్ద కూతురు నబిహా అంబర్‌ను ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉర్దూ మీడియం పాఠశాలలో చదివించగా రెండో కూతురు ఫరీహా అంబర్ ఉర్దూ మీడియం పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. మూడో కూతురు సుహేరా అంబర్ ఎంపీపీఎస్ ఉర్దూ మీడియంలో నాలుగో తరగతి చదివిస్తున్నారు. జడ్చర్ల మండలం తంగేళ్లపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేసే ఆనంద్‌కుమార్ అనే ఉపాధ్యాయుడు తన కూతురు శ్రీ వేదను రెండో తరగతిలో అదే పాఠశాలలో చేర్పించారు. రోజూ తనే తీసుకెళ్లి తీసుకొస్తున్నారు. వెల్దండ మండలం కొట్ర ప్రాథమిక పాఠశాలలో సీఆర్‌పీ పనిచేసే ఆంజనేయులు తన పిల్లలను అదే పాఠశాలలో చేర్పించారు. అమ్రాబాద్ మండలం ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఎలయ్య అనే ఉపాధ్యాయుడు తన కూతురు ఇన్నను తను పనిచేస్తున్న పాఠశాలలోనే నాలుగో తరగతిలో చేర్పించారు. మహ్మదాబాద్ మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాలలో పనిచేసే దస్తయ్య అనే ఉపాధ్యాయుడు తన ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివిస్తున్నాడు.

గౌతం మౌర్య నాలుగో తరగతి, సిద్ధార్థ మౌర్య రెండో తరగతి చదువుతున్నారు. వంగూరు మండలం తుమ్మలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కోటేశ్వరరావు తన ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే ఒకరిని ఆరో తరగతి, మరొకరిని ఏడోవ తరగతి చదివిస్తున్నారు.

● నారాయణపేట జిల్లా ఉట్కూరు మండలం పులిమామిడి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ టీచర్‌గా పనిచేస్తున్న మహేష్‌కుమార్ తన ఇద్దరు కుమార్తెలను అదే జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో జాయిన్ చేశారు. నిత్య శ్రీ ఏడో తరగతి చదువుతుండగా నవ్యశ్రీ ఆరో తరగతి చదువుతోంది. మరికల్ గ్రామానికి చెందిన మహేష్‌కుమార్ ఇటీవల బదిలీపై పులిమామిడి పాఠశాలకు రాగా తను పనిచేసే పాఠశాలలోనే కూతుళ్లను చేర్పించారు. ఎలాంటి ఇబ్బందులు లేవని, తానే దగ్గరుండి పిల్లలను చూసుకుంటుండటం సంతోషంగా ఉన్నదని అంటారు మహేష్‌కుమార్..



● నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలంలోని మొగల్‌మడ్క ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ఎన్ అరుణ తాను పనిచేస్తున్న పాఠశాలలోనే తన కుమారుడు శ్రీహాన్‌రెడ్డిని ఒకటో తరగతిలోనే జాయిన్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవం, అధిక శిక్షణ కలిగిన ఉపాధ్యాయులు ఉంటారని, మెరుగైన విద్య అందడానికి అవకాశం ఉంటుందని, ప్రైవేటు పాఠశాలలకు పంపి శిక్షణ లేని వారితో విద్య నేర్పించడం కంటే తన కళ్ల ఎదుటే పిల్లాడు చదువుతుంటే అంతకంటే సంతోషం ఏమీ ఉండదని ఉపాధ్యాయురాలు అరుణ అంటున్నారు.





● వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలోని బున్యాదిపూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు నాగేషు తను విద్యాబోధన చేసే పాఠశాలలోనే తన కుమారుడు శశాంక్‌ను చేర్పించాడు. ఒకటో తరగతి నుంచీ అదే పాఠశాలలో చదివిస్తుండగా ప్రస్తుతం శశాంక్ మూడో తరగతి చదువుతున్నాడు. ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతోందని, ఉన్నత చదువులు అభ్యసించే విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలు పునాదుల లాంటివని అంటున్నారు. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచాలంటే ప్రతీ ఉపాధ్యాయుడు అక్కడే చదివించాలంటున్నారు నాగేషు..

● నాగర్‌కర్నూలు జిల్లా ఉప్పునుంతల మండలంలోని పెనిమిల్ల ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయుడు కేశవరావు తన కొడుకు వేదవ్యాస మహర్షిని గత ఏడాది తాను విద్యాబోధన చేస్తున్న పాఠశాలలోనే నాలుగో తరగతిలో చేర్చుకొని గ్రామస్థులు, సహచర ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచారు. తమపై తమకు నమ్మకం లేక విద్యార్హతలు సరిగా లేని ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత సాధించని వారితో పిల్లలకు విద్యాబోధన చేయిస్తే అంతకంటే దారుణం ఉండదని భావించి ముందుగా తాను మారాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేశవరావు అంటున్నారు.



క్రైం కార్నర్

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

» హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి చేరిన మృతదేహాన్ని తిప్పి పంపిన పోలీసులు


హనుమంతు (ఫైల్)

ఖిల్లాఘణపురం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోతులకుంట తండాకి చెందిన కేతావత్ హనుమంతు(38) హైదరాబాద్ గచ్చిబౌలి సమీపంలోని గోపన్‌పల్లి చెరువు వద్ద మంగళవారం అనుమానాస్పదంగా మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు హనుమంతు హైదరాబాద్ గోపన్‌పల్లి శివారు ప్రాంతంలో కత్తితో గొంతు కింది భాగంలో కోసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం స్వగ్రామం కోతులకుంట తండాకు మంగళవారం సాయంత్రం తీసుకొచ్చారు. అప్పుల బాధతోనే మృతుడు హనుమంతు ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి కత్తి గాట్లు ఉన్న ఫొటోలు వాట్సాప్‌లో హైదరాబాద్, స్వగ్రామంలో వైరల్‌గా మారాయి. పోలీసులకు అందిన సమాచారం మేరకు.. మృతుడికి కత్తిగాట్లు ఉండడంతో హైదరాబాద్‌లో సంఘటన జరిగినందున మృతదేహాన్ని తిప్పి పంపినట్లు కొత్తకోట సీఐ రాంబాబు తెలిపారు. హైదరాబాద్ పరిధిలోని పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తారని సీఐ తెలిపారు. మృతుడి స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామంలో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య జమునమ్మ, కుమారులు రవి, సంతోష్ ఉన్నారు. కోతులకుంట తండాలో కొత్తకోట సీఐ రాంబాబు పర్యవేక్షణలో ఇన్‌చార్జి ఎస్ఐ జయన్న ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది మృతదేహాన్ని హైదరాబాద్‌కు తరలించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఐదుగురికి జైలు శిక్ష

నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన ఐదుగురికి జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ శృతి దూత జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ గోవర్ధన్ మంగళవారం తెలిపారు. వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు తనిఖీలో ఐదుగురు పట్టుబడ్డారు. పెద్దకొత్తపల్లి మండలం పెద్దకార్పాములకు చెందిన కూర మధుకు 7రోజులు జైలు శిక్ష అదే మండలంలోని చంద్రకల్ గ్రామానికి చెందిన ఎది రేపల్లి రాములుకు రెండు రోజుల జైలు శిక్ష, రేవల్లి మండలం గట్టురాయి పాకులకు చెందిన దోతి గిరిబాబుకు రెండు రోజుల జైలు శిక్ష, నాగర్‌కర్నూల్‌కు చెందిన ముమ్మిడి శ్రీనివాస్‌చారి ఒక రోజు జైలు శిక్ష, నాగర్‌కర్నూల్ మండలంలోని గగ్గలపల్లికి చెందిన చిక్కొండ్ర వెంకటయ్యకు ఒక రోజు జైలు శిక్షను విధిస్తూ తీర్పు చెప్పారని ఎస్ఐ పేర్కొన్నారు. మద్యం తాగి ఎవరైనా వాహనాలు నడిపి పట్టుబడితే కఠినంగా శిక్షలు ఉంటాయని ఎస్ఐ హెచ్చరించారు.

మహిళ అనుమానాస్పద మృతి

అయిజ టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలోని మాలపేటకు సమీపంలో ఉంటున్న సరోజ (ఈరమ్మ) (42) అనుమానాస్పదంగా మృతి చెందింది. ఎస్సై శ్రీనివాస రావు కథనం ప్రకారం.. మంగళవారం మధ్యాహ్నం ఇంట్లోని మంచంపై సరోజ పడి ఉండటాన్ని గ్రహించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మహిళ మృతి చెందిందని డాక్టర్లు చెప్పటంతో ఇంటికి తీసుకెళ్లారు. సమాచారం అందడంతో ఎస్ఐ మృతురాలి ఇంటికి చేరుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సరోజకు కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పోస్టాఫీసు ఖాతాలో డబ్బు ఖాళీ

మానవపాడు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నారాయణపురం గ్రామానికి చెందిన శ్రీకాంత్‌రెడ్డి అనే రైతుకు మానవపాడు పోస్టాఫీస్‌లో ఖాతా ఉంది. ఈ ఖాతాలో పీఎం కిసాన్ పథకం, వంటగ్యాస్ సబ్సిడీ డబ్బులు జమ అవుతుండేవి. పీఎం కిసాన్ ద్వారా ఇప్పటికి 19సార్లు నగదు జమ కాగా రైతు శ్రీకాంత్‌రెడ్డి ఆరుసార్లు డ్రా చేసుకున్నాడు మిగిలిన డబ్బు ఖాతా నుంచి ఎవరు తీశారనే విషయంపై నివేదిక ఇవ్వాలని పోస్టు మాస్టర్ మంగళవారం రామనాథ్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో అదే కార్యాలయంలో పనిచేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగి తీసుకున్నట్లు తెలిసిందని, ఈ విషయంపై ఉన్నతాధికారులకు తెలియజేస్తామని పోస్టుమాస్టర్ చెప్పారు.

లొద్ది మల్లయ్య దర్శనానికి అనుమతి ఇవ్వాలి

» బజరంగ్ దళ్ అచ్చంపేట ప్రముఖ్ శివ చంద్ర


డీఎఫ్‌వోకు వినతి పత్రం అందజేసిన బజరంగ్‌దళ్ సభ్యులు

అచ్చంపేటటౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఏకాదశి పర్వదినాన లొద్ది మల్లయ్య దర్శనానికి అనుమతి ఇవ్వాలని బజరంగ్‌దళ్ అచ్చంపేట ప్రముఖ్ శివ చంద్ర అన్నారు. మంగళవారం పట్టణంలోని ఫారెస్ట్ కార్యాలయంలో డీఎఫ్‌వో రోహిత్ గోపిడిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ నెల 6వ తేదీన తొలిఏకాదశి పర్వదినం సందర్భంగా లొద్ది మల్లయ్య దేవస్థానాన్ని భక్తులు దర్శించుకునేందు అటవీ అధికారులు అనుమతులు ఇవ్వాలని కోరారు. డీఎఫ్‌వో రోహిత్ గోపిడి మాట్లాడుతూ అభయారణ్యంలో ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, అభయారణ్యంలో వెలిసిన మల్లయ్యను దర్శించుకు నేందుకు ఒక్కరోజు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. అటవీప్రాంతంలో చెట్లను కొట్టకుండా జంతువులకు హాని కలిగించకుండా దర్శనం చేసుకోవాలని సూచించారు. అభయారణ్యంలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చందులాల్ చౌహాన్, శివాజీ, నరేష్, తిరుపతి, అజయ్ కుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.

పాఠశాలకు డ్యూయల్ డెస్క్ బెంచీల వితరణ


డ్యూయల్ డెస్క్, బెంచీలు అందించిన బాలస్వామి, పక్కన హెచ్ఎం

తెలకపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గౌతంపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం గ్రామానికి చెందిన ఐపీఎస్ బాలస్వామి, అదే గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు మిద్దె పరశురాములు లక్ష రూపాయల విలువ చేసే 25 డ్యూయల్ డెస్క్ బెంచీలను అందించారని హెచ్ఎం ఎం. రమేష్ మంగళవారం తెలిపారు. గతంలో కూడా ఐపీఎస్ బాలస్వామి రూ. 8 లక్షలతో పాఠశాల పునరుద్ధరణకు సహకరించారని పేర్కొన్నారు. గ్రామంలో బాలస్వామి వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నందున విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు, యువకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వనమహోత్సవానికి సమయం ఆసన్నం

» వనపర్తి జిల్లాలో 50 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం
» 255 గ్రామ పంచాయతీల్లో నర్సరీల నిర్వహణ
» మొక్కలు నాటేందుకు స్థలాల గుర్తింపు


పెద్దగూడెం గ్రామంలో నాటేందుకు సిద్ధంగా ఉన్న మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

వనపర్తి రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి) : పచ్చదనాన్ని పెంచడంతో పాటు పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం వన మహోత్సవానికి శ్రీకారం చుట్టింది. గత బీఆర్ఎస్ హయాంలో హరితహారం పేరుతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వన మహోత్సవం పేరుతో కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అందుకోసం వనపర్తి జిల్లాలోని 255 గ్రామ పంచాయతీల పరిధిలో అధికారులు నర్సరీలను ఏర్పాటు చేసే మొక్కలను పెంచుతున్నారు. వర్షాల ఆధారంగా ఈ నెల మొదటి వారం లేదా రెండవ వారంలో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు వివిధ శాఖల ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాలు, రహదారులకు ఇరువైపులా, పొలాలు, చెరువుల గట్లపైన, ప్రభుత్వ కార్యాలయాలు, కమ్యూనిటీ కేంద్రాలు, ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల ఆవరణల్లో మొక్కలు నాటేందుకు ఖాళీ స్థలాలను గుర్తిస్తున్నారు. మొక్కలు నాటేందుకు గుంతలు తీసే పనులు కొనసాగుతున్నాయి.

జిల్లా వ్యాప్తంగా 58 లక్షల మొక్కలు

వనపర్తి జిల్లాలోని 14 మండలాల పరిధిలో 255 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రతీ గ్రామ పంచాయతీ పరిధిలో నర్సరీలను ఏర్పాటు చేశారు. ప్రతీ నర్సరీలో దాదాపు 10 వేల మొక్కలను పెంచుతున్నారు. గ్రామీణ అభివృద్ధి, వ్యవసాయ, పోలీస్, నీటి పారుదల, విద్య, వైద్య, విద్యుత్, పశు సంవర్ధక, ట్రైబల్ వెల్ఫేర్ శాఖల ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఈనెలలో జిల్లా వ్యాప్తంగా 50 లక్షల మొక్కలను నాటేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. మొక్కలు నాటేందుకు గుంతలను తవ్వించాలని సంబంధిత శాఖల అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పూలు, పండ్ల మొక్కలతో పాటు రోడ్లకు ఇరువైపులా నీడ నిచ్చే మొక్కలను నాటేందుకు ప్రణాళికలు రూపొందించింది. అలాగే గ్రామ పంచాయతీల్లో ప్రతీ ఇంటికి 6 మొక్కలను పంపిణీ చేయాలని నిర్ణయించారు. నర్సరీల్లో గులాబీ, మందార, గన్నేరు, సీతాఫలం, జామ, ఉసిరి, అల్ల నేరేడు, మునగ, తులసి, దానిమ్మ, బొప్పాయి, ఈత, వేప మొక్కలతో పాటు ఇతర ఔషధ మొక్కలను నాటనున్నారు.

కార్యాచరణ సిద్ధం



వన మహోత్సవంలో భాగంగా డీఆర్‌డీవో ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 11.50 లక్షల మొక్కలు నాటేందుకు కార్యాచరణ సిద్ధం చేశాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెలలో మొక్కలు నాటేందుకు చర్యలు చేపడతాం. డీఆర్‌డీఏ తరపున ఈనెలాఖరులోగా గుంతలు తీయాలని ఈజీఎస్ సిబ్బందికి సూచించాం. ప్రతి ఇంటికి 6 చొప్పున పూలు, పండ్లు, ఔషధ మొక్కలు అందజేస్తాం.

- ఉమాదేవి, డీఆర్‌డీవో

బాలలకు బంగారు భవిష్యత్తు

» బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై ప్రత్యేక దృష్టి
» అందుకోసం అధికారులు కృషి చేయాలి
» నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : బాలల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేలా అధికారులు కృషి చేయాలని నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆపరేషన్ ముస్కాన్-11 నిర్వహణపై జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఆపరేషన్ ముస్కాన్‌ను విజయవంతం చేయాలన్నారు. ఈనెల 1 నుంచి 31వ తేదీ వరకు అన్ని శాఖల అధికారుల సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ప్రతీ అధికారి పక్కా ప్రణాళికను రూపొందించుకుని బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు కృషి చేయాలని కోరారు. బాల కార్మికులు కన్పిస్తే 1098కు వెంటనే సమాచారమందించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. బాల బాలికలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమన్న విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. గత సంవత్సరం నిర్వహించిన ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో 30 మందిని, ముస్కాన్ కార్యక్రమంలో 24 మంది పిల్లలను పనుల నుంచి విముక్తి కల్పించి, యజమానులపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయం, అదనపు ఎస్పీ రామేశ్వర్, సంక్షేమ శాఖ అధికారి రాజేశ్వరి, లేబర్ అధికారి చైల్డ్ ప్రొటెక్షన్ చైర్మన్ లక్ష్మణరావు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై ఆర్టీసీ ఉద్యోగుల్లో అసంతృప్తి

» టీఎంయూ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అశ్వత్థామరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అశ్వత్థామరెడ్డి

మహబూబ్‌నగర్ టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్టీసీ ఉద్యోగుల్లో అసంతృప్తి ఉందని, సమ్మె అనివార్యమైతే ఇందుకు యజమాన్యం, ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలంగాణ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అశ్వత్థామరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని వీవీ కన్వెన్షల్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీని ఆదుకోవాలని, ఎన్నికల ముందు ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఇచ్చాన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు రెండు పీఆర్‌సీ బకాయిలతో పాటు సమస్యలు పరిష్కరించాలన్నారు. గత ప్రభుత్వం ఆర్టీసీని నిర్వీర్యం చేసిందని, అప్పుడు ఉద్యోగులు తమ వంతుగా ప్రచారం నిర్వహించి కాంగ్రెస్ పార్టీని గెలిపించుకున్నామని స్పష్టం చేశారు. డిమాండ్ల సాధన కోసం మరో పోరాటానికి సిద్ధం కావాలనే ఆలోచనతో అన్ని సంఘాలు కలిసి జేఏసీగా ఏర్పాటు అవుతున్నాయని, త్వరలోనే సమావేశం కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆ దిశగానే ప్రతీ జిల్లాలో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఉద్యోగులు సమ్మెకు వెళ్తే అందుకు బాధ్యత ప్రభుత్వం ఇటు యాజమాన్యం వహించాల్సి ఉంటుందన్నారు. ఉద్యోగుల పని గంటలు పెంచడంతో మహిళా ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం, యాజమాన్యం స్పందించి వెంటనే ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, డీఎస్ చారి, భానుప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం కల్పించాలి


తిమ్మాజిపేట మద్యం డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నిరుద్యోగ యువకులు

తిమ్మాజిపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో గల ఉమ్మడి పాలమూరు జిల్లాకు మద్యం సరఫరా చేసే మద్యం డిపోలో హమాలీలుగా పని చేసేందుకు నిరుద్యోగ యువకులకు ఉపాధి అవకాశం కల్పించాలని పలువురు యువకులు డిమాండ్ చేశారు. మంగళవారం డిపో ముందు 15మంది యువకులు ధర్నా నిర్వహించారు. నిరుద్యోగ యువకుల ఐక్యత వర్ధిల్లాలని, ఉపాధి అవకాశం కల్పించాలని నినాదాలు చేశారు. పలువురు యువకులు మాట్లాడుతూ లిక్కర్ బీరు అసోసియేషన్ వారి అనుమతులు పొందామన్నారు. 2008, 2009 సంవత్సరంలో మూడు నెలల పది రోజుల పాటు డిపో ముందు రిలే నిరాహార దీక్షలు చేసినట్లు తెలిపారు. అధికారులు ఎవరూ స్పందించకపోవడంతో హైకోర్టును ఆశ్రయించగా తమకు అనుకూలంగా తీర్పు ఇవ్వడమే కాకుండా యువకులను విధుల్లోకి తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసిన విషయాన్ని వారు గుర్తు చేశారు. కాలయాపన జరుగుతోంది తప్ప తమకు న్యాయం జరగడం లేదని, ఉపాధి అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం మద్యం డిపో మేనేజర్ శ్రీధర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు జోగు ప్రదీప్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్‌గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొత్త వెంకటేశ్, నాయకులు స్వామి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి టోర్నీలో విజేతగా నిలవాలి

» జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ. వెంకటేశ్
» ఉత్సాహంగా జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక


ఫుట్‌బాల్ క్రీడాకారులతో జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్ తదితరులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ జూలై 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నీలో జిల్లా జట్టు విజేతగా నిలవాలని ఉమ్మడి జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు, జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్, డీవైఎస్‌వో శ్రీనివాస్ అన్నారు. మంచిర్యాల జిల్లా రామకృష్ణపురంలో ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బాలికల జూనియర్ ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాలికల జట్టు ఎంపికలను మంగళవారం స్టేడియం మైదానంలో నిర్వహించారు. ఈ ఎంపికలను ఎన్పీ వెంకటేశ్ ప్రారంభించి, మాట్లాడారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. బాలికలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్యాట్రన్ టీఎస్ రంగారావు, ఉపాధ్యక్షుడు రమేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి భానుకిరణ్, కోశాధికారి నగేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇమ్మనుయ్యల్ జేమ్స్, వెంకట్‌రాములు, ఫుట్‌బాల్ కోచ్ నికేష్ పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ టోర్నీ మూడో స్థానంలో మహబూబ్‌నగర్


రాష్ట్రస్థాయిలో మూడో స్థానంలో నిలిచిన జిల్లా బాలుర జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : నిజామాబాద్ జిల్లాలో మంగళవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి బాలుర జూనియర్ ఫుట్‌బాల్ టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బాలుర జట్టు మూడో స్థానంలో నిలిచింది. రాష్ట్రస్థాయి టోర్నీలో జట్టు మూడో స్థానంలో నిల్వడంతో జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎన్పీ వెంకటేశ్ అభినందించారు. ఫుట్‌బాల్‌లో జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

జెన్‌కోలో సాధారణ బదిలీలు చేపట్టాలి

» ఎస్ఎల్‌బీహెచ్ఈఎస్ బ్రాంచ్ సెక్రెటరీ మధన్‌మోహన్ రెడ్డి



జెన్‌కో నూతన డైరెక్టర్ బాలరాజుకు వినతి పత్రం అందజేస్తున్న ఇంజనీర్లు

దోమలపెంట జూలై 1 (ఆంధ్రజ్యోతి) : జెన్‌కోలో ఐదేళ్లుగా బదిలీలు జరగడంలేదని, సాధారణ బదిలీలు చేపట్టాలని ఎస్ఎల్‌బీహెచ్ఈఎస్ బ్రాంచ్ సెక్రెటరీ మధన్‌మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం ఈగలపెంటలోని జెన్‌కో కార్యాలయంలో జెన్‌కో నూతన డైరెక్టర్ బాలరాజును ఈగలపెంట జెన్‌కో నూతన సీఈ కేవీవీ సత్యనారాయణను ఇంజనీర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లకు పైగా తాము ఏజెన్సీ ప్రాంతం శ్రీశైలం భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో పనిచేస్తున్నామని తెలిపారు. తమకు జెన్‌కో సంస్థలో పనిచేస్తున్న ఇంజనీర్లకు ఉద్యోగులకు సరైన వైద్యం, వారి పిల్లలకు నాణ్యమైన విద్య అందడం లేదని పేర్కొన్నారు. ఏదైనా ఆపద వస్తే సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతం అంతా అమ్రాబాద్ అభయారణ్య పరిధిలో ఉన్నందున రాత్రివేళ 9గంటలకు వాహనాల రాకపోకలు నిలిపివేయడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇంజనీర్ల అసోసియేషన్ సెక్రెటరీ చరణ్, చంద్రశేఖర్, సందీప్, నాయకులు యేసయ్య, పాల్, రామయ్య, లక్ష్మయ్య, మద్దేష్, మల్లికార్జున, సరోజమ్మ, మేరీ, సీత ఉద్యోగులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

కూరగాయల సాగుతో అధిక లాభాలు


ఉడుగులగడ్డ తండాలోని తీగజాతి కూరగాయల పంటలను పరిశీలిస్తున్న హార్టికల్చర్ అధికారి మహేందర్

మిడ్జిల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లోని రైతులు కూరగాయల సాగుపై మక్కువ పెంచుకొని అధిక లాభాలు పొందాలని హార్టికల్చర్ అధికారి మహేందర్ అన్నారు. మంగళవారం మండలంలోని వేముల గ్రామ పంచాయతీ ఉడుగులతండాలో రైతులు సాగుచేస్తున్న తీగజాతి, కూరగాయల పంటలను పరిశీలించారు. కూరగాయల పంటలకు చీడపీడలను గమనించి సస్యసరక్షణ చర్యలు గురించి వివరించారు. ప్రభుత్వం తీగ జాతి కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు పందిర్ల ఏర్పాటుకు ఎకరానికి రూ.లక్ష వరకు రాయితీ కల్పిస్తోందన్నారు. దీంతో పాటు డ్రిప్పును కూడా రాయితీ ద్వారా అందజేస్తుందని దీన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఇంటర్వ్యూ..

ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ బోధన

● సురేష్, ఎంఈవో, మల్దకల్

మల్దకల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ బోధన కొనసాగుతుందని ఎంఈవో సురేష్ తెలిపారు. విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తున్నామని, ఉచితంగా పుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం అందజేస్తున్నామని 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో చెప్పారు. మరిన్ని విషయాలు మాట్లాడారు.



ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా ఎంతమంది చేరారు?

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది కొత్తగా 710 మంది విద్యార్థులు చేరారు.

విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఉపాధ్యాయులు ఉన్నారా?

మండలంలో తొమ్మిది ఉన్నత పాఠశాలలు, 27 ప్రాథమిక, నాలుగు ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. మొత్తం 205మంది ఉపాధ్యాయులు అవసరం ఉండగా, ప్రస్తుతం 196 మంది పని చేస్తున్నారు. కొన్ని స్కూళ్లలో ఆయా సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులు లేరు.

మౌలిక సదుపాయాలు, వసతులు ఎలా ఉన్నాయి?

చాలా పాఠశాలల్లో గదులు లేక చెట్లకింద పాఠాలు బోధించాల్సి వస్తుంది. కొన్ని భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. అదనపు గదులు అందుబాటులోకి రావాల్సి ఉంది.

న్యూస్ బాక్స్

రేపు వాహనాల వేలంపాట

● ఎక్సైజ్ సీఐ గణపతిరెడ్డి

గద్వాల క్రైం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గద్వాల జిల్లా కేంద్రంలోని గద్వాల ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌లో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు గురువారం (3న) వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ గణపతి రెడ్డి తెలిపారు. రెండు ద్విచక్ర వాహనాలు, ఒక స్కార్పియో వాహనం ఉందని తెలిపారు. ఆసక్తి గల వారు గురువారం ఉదయం 10గంటలకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ వద్దకు వచ్చి ధరావతుగా రూ.5వేలు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని తెలిపారు.

కళాశాలల బంద్ వాల్‌పోస్టర్ విడుదల

గద్వాల సర్కిల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపు విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపడంతో పాటు తక్షణమే చెల్లించాలన్న డిమాండ్‌పై 72గంటల డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ కళాశాలల బంద్‌కు పీడీఎస్‌యూ నేతలు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం గద్వాలలోని ఓ ప్రైవేట్ పీజీ కళాశాల ఆవరణలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీంపాషా వాల్‌పోస్టర్ విడుదల చేశారు. బుధవారం నుంచి (2, 3, 4వ తేదీ వరకు) శుక్రవారం వరకు ప్రొఫెషనల్ విద్యా సంస్థల(డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్) బంద్‌కు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహేష్, బుడ్డన్న, ఇమ్రాన్, శివ, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు 33కేవీ ఆయిల్‌సీడ్ ఫీడర్ కింద ఉన్న లైన్‌కు తాకే చెట్లకొమ్మలను తొలగిస్తున్న కారణంగా ఈనెల 2వ తేదీ బుధవారం ఉదయం 9నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీరెల్లి, లత్తిపురం, తుర్కోనిపల్లి, తెలుగోన్‌పల్లి, గుర్రంగడ్డ, వీరాపురం, అనంతపురం, ఇండస్ట్రియల్ ఏరియా,జమ్మిచేడు, మేళ్లచెరువు, పుటాన్‌పల్లి, కొండపల్లి, బసలచెరువు గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

ఎస్సీ హాస్టల్‌లో సమస్యల తిష్ట

మానవపాడు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్ పరిసరాలు శుభ్రం చేయించాలని హాస్టల్ వార్డెన్ రాము మంగళవారం ఎంపీడీవో భాస్కర్‌కు వినతిపత్రం అందించారు. హాస్టల్ చుట్టుపక్కల ముళ్లపొదలు, చెత్త పేరుకు పోయిందని తెలిపారు. పందుల సంచారంతో దుర్వాసన తీవ్రమైందని, దీనివల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

బాల్యవివాహాలపై అవగాహన

రాజోలి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సీతారాముల ఆలయంలో మహిళా సంఘాల సభ్యులకు మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ జిల్లా బాలల సంరక్షణ విభాగం ఓఆర్‌డబ్ల్యూ లక్ష్మీదేవి బాల్యవివాహాలపై, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రూపు ద్వారా బ్యాంకు రుణాలు తీసుకుని ఆర్థికంగా ఎదగాలని చెప్పారు.

మహిళ ఆత్మహత్య

కేటీదొడ్డి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన కుచినెర్లలో మంగళవారం చోటుచేసుకుందని ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. గ్రామానికి చెందిన పద్మ(30) చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్థులు ఆమె మృతదేహాన్ని బయటికి తీశారు. ఆమె అక్క నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

అన్ని శాఖలు సమన్వయంతో ఉండాలి

● కలెక్టర్ బీఎం సంతోష్

● విపత్తు నిర్వహణ యాక్షన్‌ప్లాన్‌పై అధికారులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్, చిత్రంలో ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల న్యూటౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు, అన్ని శాఖలు సమన్వయంతో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీవోసీ సమావేశపు హాలులో విపత్తు నిర్వహణ యాక్షన్ ప్లాన్‌పై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విపత్తులు సంభవించిన తర్వాత స్పందించేది కాకుండా ముందుగానే జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. కృష్ణా, తుంగభద్ర నదులకు మధ్యలో గద్వాల జిల్లా ఉండటంతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గత 10 సంవత్సరాలలో ఎలాంటి విపత్తులు సంభవించలేదని, 2009లో వరదలు వచ్చినప్పుడు పంట నష్టం జరిగిందన్నారు. ఇతర సమస్యలు తలెత్తలేదన్నారు. ఈసారి జిల్లాలో ముందస్తుగా జూన్ నుంచి వర్షాలు కురుస్తున్నందున అధికంగా వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. విపత్తులు రాక ముందే ముందస్తు చర్యలలో భాగంగా జిల్లాస్థాయి మాదిరిగా అన్ని మండలాలు, గ్రామస్థాయిలో కమిటీలను తహసీల్దార్ అధ్యక్షతన ఏర్పాటు చేసుకొని సమావేశాలు నిర్వహించుకోవాలన్నారు. అదనపు కలెక్టర్‌ను విపత్తుల జిల్లా నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. తహసీల్దార్లు మండలస్థాయిలో సమావేశాలు నిర్వహించి సమర్థవంతమైన బృందాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. నదీ పరివాహక ప్రాంతాల్లోని గ్రామాలకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. శిథిలావస్థలో ఉన్న గృహాలను, పాఠశాలలను ముందస్తుగానే గుర్తించి అవసరమైతే వారిని ఇతర ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ విపత్తు నిర్వహణ చట్టం- 2025 ప్రాముఖ్యతను ప్రతీ ఒక్కరు తెలుసుకోవాలన్నారు. జిల్లాలో భౌగోళికంగా ఎక్కడా ఎలాంటి పరిశ్రమలు లేవని, మారుతున్న వాతావరణానికి అనుకూలంగా వర్షాల వల్ల విపత్తులు సంభవించే అవకాశం ఉన్నదన్నారు. భారీవర్షాల వల్ల శిథిలావస్థలో ఉన్న గృహాలు కూలిపోయి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు.

ఇందుకు జిల్లా, మండలస్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏ ర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, ఫైర్, ఎలక్ట్రిసిటీ అధి కారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఆర్డీవో అలివేలు, సంబంధిత శాఖాధికారులు ఉన్నారు.

రిటైర్డ్ హెడ్‌మాస్టర్‌కు ఆత్మీయ వీడుకోలు

● సన్మానించిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



ఇమానియేల్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

గద్వాల టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ పొందిన పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెడ్‌మాస్టర్ ఇమానియేల్‌ను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. ఉద్యోగ విరమణతో పాటు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే, ఆయన శేష జీవితం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. గద్వాల బాలుర ఉన్నత పాఠశాలకు సుదీర్ఘమైన చరిత్ర ఉన్నదని, ఇక్కడ విద్యను అభ్యసించిన వారు వివిధ రంగాల్లో ఉన్నతస్థాయిలో రాణిస్తూ గద్వాలకు పేరు సాధించి పెట్టారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఎస్‌బీఐ చైర్మన్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌శెట్టి ఇదే పాఠశాల విద్యార్థికావడం మనకు గర్వకారణమని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ్, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎండీ బాబర్, మాజీ కౌన్సిలర్ మురళి, నాయకులు గోవిందు, ధర్మనాయుడు, ఇన్‌చార్జి హెడ్‌మాస్టర్ పాఠశాల ఉపా ధ్యాయులు ఉన్నారు.

పెండింగ్ సదరం సర్టిఫికెట్లను పూర్తి చేయాలి

● జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు

గద్వాల క్రైం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వెయిటింగ్‌లో ఉన్న సదరం సర్టిఫికెట్లను వెంటనే పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు చెప్పారు. మంగళవారం సదరం క్యాంపును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన దరఖాస్తుదారులకు సకాలంలో యూడీఐడీ కార్డులను పోస్టులో పంపించేలా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. సదరం సర్టిఫికెట్ కోసం వచ్చే దివ్యాంగులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు.

కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిర, డీఆర్‌డీఏ ఏవో సిద్ధయ్య, కంప్యూటర్ ఆపరేటర్ శశిధర్, డాటాఎంట్రీ ఆపరేటర్ శారద, సాయి ప్రకాశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన లేబర్ కోడ్‌లను ప్రతిఘటించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి నరసింహ

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి నరసింహ

గద్వాల టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కార్మిక సంఘాలన్నీ ఏకమై ఐక్య పోరాటాలతో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన లేబర్ కోడ్‌లను ముక్తకంఠంతో ఎదురించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నరసింహ అన్నారు. మంగళవారం పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు సి.హనుమంతుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కొత్త లేబర్ కోడ్‌ల అమలు వల్ల కార్మికులు యాజమాన్యాలకు బానిసలుగా మారే ప్రమాదం ఉందన్నారు. కనీస వేతనాల అమలుకు అవకాశం లేకపోగా సామాజిక భద్రత కార్మికులకు లభించదని, ఈపీఎఫ్ కాంట్రిబ్యూషన్ సైతం పన్నెండు నుంచి పది శాతానికి తగ్గిపోతుందన్నారు. వీటితో పాటు వివిధ ప్రభుత్వ శాఖల పరిధిలో పనిచేస్తున్న సిట్టింగ్ వర్కర్లకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఈక్రమంలో జూలై 9న జాతీయ కార్మిక సంఘాలు తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో జిల్లాలోని కార్మికులు పాల్గొనాలన్నారు. సమావేశంలో సీఐటీయూ, టీయూసీఐ నాయకులు ఉప్పేరు నరసింహ, మోష, సులేమాన్, రంగన్న ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

అలంపూర్ చౌరస్తా, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లి మండలం అలంపూర్ చౌరస్తా సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. అలంపూర్ నుంచి అలంపూరు చౌరస్తా వైపు బొలెరో వస్తుండగా ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనదారుడు బొలెరో వాహనాన్ని ఢీకొన్నాడు. దీంతో బైక్ ఉన్న వ్యక్తికి తీవ్ర గాయలవడంతో 108 అంబులెన్స్‌లో బొలెరో యాజమాని నరేష్‌రెడ్డి వెళ్లి కర్నూలులోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

వరద నీటిని చెరువులకు మళ్లించాలి

● తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర అధ్యక్షుడు జక్కుల వెంకటయ్య

గద్వాల టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదికి వరదగా వస్తున్న నీటిని జూరాల డ్యాం ద్వారా జిల్లాలోని చెరువులు, కుంటలకు మళ్లించాలని తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర అధ్యక్షుడు జక్కుల వెంకటయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర కోకన్వీనర్ ప్రభాకర్, రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్, శంకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లుతో కలిసి మంగళవారం పట్టణంలోని యూనియన్ కార్యాలయం వద్ద జక్కుల వెంకటయ్య విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే జూరాల జలాశయంలో ఏడు టీఎంసీలకు పైగా నీరు వచ్చి చేరినందున కాల్వలకు నీటిని విడుదల చేసి, సాగుకు అనుకూల వాతావరణం కల్పించాలన్నారు. జిల్లాలోని నెట్టెంపాడు, గుడ్డెందొడ్డి, ర్యాలంపాడు, ముచ్చోనిపల్లి, తాటికుంట, నాగర్‌దొడ్డి రిజర్వాయర్లను పూర్తిసామర్థ్యంతో నీటిని నిల్వ చేయాలన్నారు. లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు తలపెట్టిన 9వ తేదీ సమ్మెను రైతు సంఘాలు విజయవంతం చేయాలన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు చేయాలి

ఇటిక్యాల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గర్భిణుల నమోదు సంఖ్య పెంచాలని, ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు జరగాలని ఇటిక్యాల పీహెచ్‌సీ డా.రాధిక అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌ఎంలకు, సూపర్‌వైజర్‌లకు డా.రాధిక నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డా.రాధిక మాట్లాడుతూ ఆరోగ్య కార్యక్రమాలన్నింటిని వందశాతం లక్ష్యం పూర్తి చేయాలన్నారు. వర్షాకాలంలో వర్షాలు ఎక్కువగా పడుతుండడం వల్ల ఇళ్లలో నీరు నిల్వ ఉండకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎవరికైనా జ్వరం, ఇతర ఏ అనారోగ్య సమస్యలు వచ్చినా వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి పంపాలని చెప్పారు. అనంతరం నేషనల్ డాక్టర్స్ డే వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.

ఎంఐఎస్ కోఆర్డినేటర్ మృతికి నివాళి



రాజేశ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

మానవపాడు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): భద్రాది జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న రాజేష్ రోడ్డు ప్రమాదంలో సోమవారం మృతి చెందాడు. దీంతో మంగళవారం మానవపాడులోని ఎంఈవో కార్యాలయం ఎదుట రాజేశ్ చిత్రపటం ఏర్పాటు చేసి సమగ్రశిక్ష ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం 20లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు వీరేశ్, మెహరున్నిసా బేగం, సుదర్శన్, రామలక్ష్మి, చంద్‌బాషా, స్వాములు ఉన్నారు.

నిబంధనల మేరకే ఇంటి నిర్మాణాలు ఉండాలి



ఇంటి లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో భాస్కర్

మానవపాడు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లు నిర్మించే ప్రతీ లబ్ధిదారులు ఉన్నతాధికారుల నిబంధనల మేరకే ఇంటి నమూనాలు ఉండాలని ఎంపీడీవో భాస్కర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అమరవాయిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ముగ్గుపోసి ప్రారంభించారు. ప్రస్తుతం గ్రామాల్లో గుర్తించిన లబ్ధిదారు త్వరగా ఇంటి నిర్మాణాలు చేపట్టాలని, అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని ఎంపీడీవో భాస్కర్ అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, గ్రామనాయకులు కాంతరెడ్డి, వెల్పుల రవి ఉన్నారు.

ఎస్‌ఐకి సన్మానం

రాజోలి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చిన నూతన ఎస్‌ఐ కె.గోకారిని మంగళవారం మండలంలోని పచ్చర్ల గ్రామస్థులు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు పరమేష్ నాయుడు, పచ్చర్ల గ్రామస్థులు పాల్గొన్నారు.

వసతులు లేని పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలి

అయిజ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వసతులు లేని ప్రైవేటు పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని బీఆర్ఎస్వీ జిల్లా కన్వీనర్ కురువ పల్లయ్య డిమాండ్ చేశారు. మంగళవారం అయిజలోని పలు పాఠశాలలను సందర్శించారు. గీతాంజలి పాఠశాలలో ఫైర్ సేఫ్టీ, ఆటస్థలం లేదని, మరుగుదొడ్ల పక్కనే చిన్నపిల్లలకు విద్యాబోధన చేస్తున్నారని, యజమాని వెంకటేష్‌పై చర్యలు తీసుకుని పాఠశాలను మూసి వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీరేష్, రాజు, నరేశ్ ఉన్నారు.

క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి



జెండాఊపి పరుగు పోటీని ప్రారంభిస్తున్న డీవైఎస్‌వో జితేందర్

● డీవైఎస్‌వో జితేందర్

గద్వాల అర్బన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి రాణించాలని డీవైఎస్‌వో జితేందర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలకు డీవైఎస్‌వో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచిపేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. చిన్నతనం నుంచి క్రీడలను పట్ల మక్కువను పెంచుకుంటే జీవితంలో స్థిరపడేందుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బీసన్న మాట్లాడుతూ అండర్-10, 12, 14 విభాగాల నుంచి పరుగుపందెం, లాంగ్‌జంప్, కిడ్స్ జావలిన్, 600మీటర్ల పరుగు పందెం, షాట్‌పుట్ తదితర పోటీలు నిర్వహించామన్నారు. ఇందులో ప్రతిభ కనబరచిన ఇరవై మంది చిన్నారులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఎంపికైన వారు ఈనెల 6న హనుమకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. జిల్లానుంచి 350 మంది క్రీడాకారులు పోటీలకు హాజరయ్యారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు నాగేష్‌బాబు, మోహన్‌మురళి, వెంకట్రాములు, జగదీశ్, రాధ ఉన్నారు.

పేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటా



లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు ఇస్తున్న ఎమ్మెల్యే విజయుడు

» అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్ చౌరస్తా, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. మంగళవారం ఆయన కర్నూలు నగరంలోని చల్లా బంగ్లాలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అలంపూరు నియోజకవర్గంలోని 93మంది లబ్ధిదారులకు రూ.20.68లక్షల విలువైన చెక్కులను అందజేశారు.

ఘనంగా డాక్టర్స్ డే సంబురం

● ప్రభుత్వ ఆసుపత్రిలో కేకు కట్‌చేసిన వైద్యులు



గద్వాల ప్రభుత్వ ఆసుపత్రిలో కేక్ కట్ చేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిర

గద్వాల న్యూటౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్స్ డే సందర్భంగా జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసిన వైద్యులు అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిర, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగేశ్వర్‌రావు, ఆర్ఎంవో అభినేష్, డాక్టర్లు ఉన్నారు.

అలాగే జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి చౌక్ నుంచి డాక్టర్లు ఐఎంఏ ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు డాక్టర్ గోవర్ధన్, డాక్టర్లు మోహన్‌రావు, శ్యాం, హర్ష ఉన్నారు.

హైమాస్ట్ లైట్లపై పార్టీ గుర్తులు ఎందుకు?

» బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి



అయిజలోని హైమాస్ట్ లైటు వద్ద పార్టీ గుర్తును చూపుతున్న బీజేపీ నాయకులు

అయిజ టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్ల దిమ్మెలపై పార్టీల గుర్తులు ఏర్పాటు చేయటం తగదని అయిజ పట్టణ బీజేపీ అధ్యక్షుడు భగత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మునిసిపాలిటీలోని పాత పోలీస్‌స్టేషన్ ఏరియాలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను సందర్శించారు. ప్రజలు కట్టిన వివిధ రకాల పన్నులతోనే ఇటువంటి ప్రజోపయోగ కార్యక్రమాలు చేస్తుండటం వల్ల వాటిపై పార్టీల గుర్తులు ఉండటం అందరికీ ఆమోదయోగ్యం కాదన్నారు. మునిసిపాలిటీ అధికారుల కూడా ఇటువంటి విషయాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొత్తబస్టాండ్ ప్రాంతంలో అత్యంత రద్దీగా ఉంటుందని ఏన్నో ఏళ్లుగా అక్కడ హైమాస్ట్ లైటు లేదని గుర్తుచేశారు. గతంలో ఉన్న హైమాస్ట్ లైటు పోల్ తుప్పుపట్టి పడిపోవటంతో దాని స్థానంలో మరొకటి ఏర్పాటు చేయాలని తాను అనేకసార్లు మునిసిపాలిటీ అధికారులకు వినతిపత్రం ఇచ్చినప్పటికీ ఏర్పాటు చేయకపోవటం బాధకరమన్నారు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు చర్యలు తీసుకుని కొత్తబస్టాండ్‌లో హైమాస్ట్ లైటు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, వీరేశ్‌గౌడు, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఇబ్బంది పెడుతున్న

పొగాకు కంపెనీ ఏజెంట్లు

- ఎస్‌ఐకి రైతుల ఫిర్యాదు

మల్దకల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కంపెనీ ఇచ్చిన పొగాకు విత్తనాలు కొనుగోలు చేసి, పంట సాగు చేశాక పొగాకు బేల్ కొనకుండా ముఖం చాటేసిన సదరు కంపెనీ ఏజెంట్లపై చర్యలు తీసుకోవాలని సద్దలోనిపల్లి రైతులు కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఎస్‌ఐ నందీకర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత ఏడాది నవంబర్‌లో గ్రామానికి వచ్చిన కంపెనీ ప్రతినిధులు భరత్, సురేందర్ తమ కంపెనీకి చెందిన విత్తనాలు కొని పంట సాగుచేస్తే అధిక దిగుబడి వస్తుందని చెప్పగా, తాము కొని సాగుచేశామని తెలిపారు. ఒక బేల్ పొగాకు రూ.18వేల నుంచి రూ.19 వేలు లాభం వస్తుందని నమ్మబలికి ఎకరాకు రూ.40వేల నుంచి రూ.50వేల వరకు ఖర్చు చేయించారన్నారు. ప్రస్తుతం కంపెనీ వారు కేవలం ఒక బేల్ మాత్రమే కొని చేతులు దులుపుకున్నారని, గ్రామంలో ప్రస్తుతం 700 నుంచి 800 బేల్‌లు ఉన్నాయని అన్నారు. వాటిని కొనమంటే ఎలాంటి సమాధానం చెప్పకుండా ఫోన్ చేసినా స్పందించడం లేదని రైతులు ఎస్‌ఐకి వివరించారు. కంపెనీ ఏజెంట్లపై తక్షణమే చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.

సీపీఐ జిల్లా 3వ మహాసభలను జయప్రదం చేయండి

● జిల్లా కార్యదర్శి ఆంజనేయులు

ఇటిక్యాల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నిరంతరం సామాన్య ప్రజల గురించి ఆలోచించి పోరాటాలు చేస్తున్న పార్టీ భారతదేశంలో సీపీఐ పార్టీ మాత్రమేనని సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు అన్నారు. మంగళవారం మండలంలోని జింకలపల్లి ఆశన్న అధ్యక్షతన ఇటిక్యాల, ఎర్రవల్లి మండలాల్లో సీపీఐ జిల్లా 3వ మహాసభలను జయప్రదం చేయాలని సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశన్న మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ గ్రామాల్లో, మండలాల్లో పార్టీ సభ్యత్వం తీసుకొని కమిటీలు ఏర్పాటు చేసి ప్రజల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ నెల 23,24వ తేదీలలో జరిగే సీపీఐ జిల్లా 3వ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు ఆశన్న, సీపీఐ జిల్లా సమితి సభ్యులు రంగన్న, అయిలన్న, పరశురాముడు, శివ, యాదగిరి పాల్గొన్నారు.